

## ఉద్యమకారుడి హఠాన్మరణం

ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ కనక లక్ష్మీరావు(59) మంగళవారం గుండెపోటుతో మరణించారు. తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయ జే ఏసీ కన్వీనర్‌గా కీలకపాత్ర పోషించారు. 8లో▸

## జీవనభృతిపై హర్షం

భైంసాటౌన్: బీడీ కార్మికులు, ప్యాకర్లు, చాటన్, బట్టీ కార్మికులు, బీడీ కమీషన్ ఏజెంట్లకు జీవనభృతి ఇవ్వాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించడం హర్షనీయమని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.హరిత అన్నారు. భైంసాలో మంగళవారం మాట్లాడారు. రాష్ట్ర కేబినెట్ ప్రకటించిన మేరకు బీడీ కార్మికులందరికీ ఆంక్షలు లేని జీవనభృతి అందించాలని కోరారు. జిల్లా కోశాధికారి సుబ్బమ్మ, నాయకులు సవిత, సాగర, సునీత, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
29.5/24.8

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం జల్లులు కురుస్తాయి.

## న్యూస్‌రీల్

### ఇలేగాంలో విద్యుత్ అధికారుల పర్యటన



విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న అధికారులు

భైంసా రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సిరాల ప్రాజెక్టు చెరువు తెగిపోవడంతో సిరాల ఇలేగాం శివారు ప్రాంతంలోని వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభాలు విరిగాయి. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రైతుల ఫిర్యాదులతో మండలంలోని ఇలేగాం, సిరాల గ్రామాల్లో టీఎస్ ఎన్పీడీసీఎల్ వరంగల్ ఆర్డీ గణపతి మంగళవారం పర్యటించారు. విరిగిన స్తంభాలను పరిశీలించారు. విరిగిన స్తంభాలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేసి త్వరలోనే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామనితెలిపారు. ఆయన వెంట ఎస్ఈ చౌహాన్, డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

### రోగులకు మెరుగైన సేవలు అందించాలి



ఓపీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో ధనరాజ్

నర్సాపూర్(జి): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆసుపత్రిని మంగళవారం తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవల గురించి డ్యూటీ డాక్టర్ అంజుమ్, డాక్టర్ విద్యుల్లతను అడిగి తెలుసుకున్నారు. ఓపీని పరిశీలించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. మంగళవారం 11 మంది గర్భిణులకు సిజేరియన్ ద్వారా ప్రసవం చేసినట్లు డాక్టర్ విద్యుల్లత తెలిపారు. నార్మల్ డెలివరీలపై దృష్టి పెట్టాలని సూచించారు.

### మంత్రిని కలిసిన వాటర్‌షెడ్ సిబ్బంది



భైంసా: వాటర్‌షెడ్ పథకాన్ని ఉపాధిహామీలో విలీనం చేస్తే తాము ఉద్యోగాలు కోల్పోతామని వాటర్‌షెడ్ ఉద్యోగులు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లో మంత్రిని మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ స్థానాల్లో తమను నియమించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో వాటర్‌షెడ్ అసిస్టెంట్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకటప్ప, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుయాదగిరి, గంగన్న, రాంబాబు ఉన్నారు.



నిర్మల్ డిపోలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

# సర్కారులోకి.. ఆర్టీసీ

- ప్రభుత్వంలో విలీనానికి రాష్ట్ర కేబినెట్ నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 2,193 మందికి ప్రయోజనం
- సంస్థ ఉద్యోగుల్లో హర్షం

నిర్మల్‌చైన్‌గేట్: ఆర్టీసీ ఉద్యోగులు ఇక ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారు. సీఎం కేసీఆర్ అధ్యక్షతన సోమవారం సమావేశమైన రాష్ట్ర కేబినెట్ టీఎస్ ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయాలని నిర్ణయించింది. విధి విధానాల ఖరారుకు ప్రత్యేక కమిటీని నియమించడంతో పాటు విలీనానికి సంబంధించిన బిల్లును వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెడుతామని ప్రకటించింది. దీంతో సంస్థ ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 2,193 మందికి ప్రయోజనం చేకూరనుంది.

**ఉద్యమంలో కీలక పాత్ర**

తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులు ముందుండి పోరాడారు. నాటి ఉమ్మడి రాష్ట్ర పాలకులు, ఉన్నతాధికారుల ఆదేశాలు సైతం లెక్క చేయకుండా బస్సులను ఎక్కడికక్కడ నిలిపివేసి మరీ ఉద్యమించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఆర్టీసీని పరిరక్షించడంతో పాటు కార్మికులకు అండగా నిలుస్తామనే అప్పటి ఉద్యమనేత కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా పనిచేశారు. స్వరాష్ట్రం సిద్ధించాక తమకు గుర్తింపు దక్కుతుందని ఆశపడ్డారు. అయితే ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంతో కొంత

| డిపో | డ్రైవర్లు | కండక్టర్లు | ఇతర ఉద్యోగులు |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 157 | 203 | 29 |
| ఆసిఫాబాద్ | 118 | 115 | 19 |
| భైంసా | 63 | 146 | 19 |
| మంచిర్యాల | 181 | 225 | 27 |
| నిర్మల్ | 171 | 217 | 18 |
| ఉట్నూర్ | 34 | 52 | 13 |

నిరాశకు గురయ్యారు.

**సమ్మెకు దక్కిన ఫలితం**

బీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారం చేపట్టాక ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలంటూ సమ్మెబాట పట్టారు. ఉద్యోగ భద్రతతో పాటు వేతన స్కేల్ అమలు తదితర డిమాండ్లతో 2019లో నిరవధిక సమ్మెకు దిగారు. అక్టోబర్ 5 నుంచి నవంబర్ 26 వరకు ఏకంగా 52 రోజుల పాటు ఆందోళన కొనసాగించారు. ప్రభుత్వం తాత్కాలిక సిబ్బందిని నియమించి బస్సులను నడిపించినా వాటికి ఎలాంటి ఆటంకం కలిగించకుండా హక్కుల సాధనకు శాంతియుతంగా పోరాడారు. వారి పోరాటంతో స్పందించిన ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అప్పటి నుంచి వారంతా సర్కారు కరుణ కోసం వేచి చూస్తునే ఉన్నారు. తాజాగా వారి నిరీక్షణకు తెర దించుతూ ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారిని సర్కారు ఉద్యోగులుగా గుర్తించేలా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రకటించింది. దీంతో

| రీజియన్ పరిధిలో | |
|---|---|
| డిపోలు | 06 |
| మొత్తం ఉద్యోగులు | 2193 |
| డ్రైవర్లు | 725 |
| కండక్టర్లు | 958 |
| ఇతర ఉద్యోగులు | 276 |

ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతుంది.

**పేస్కేల్, డీఏలపై రాని స్పష్టత**

విలీనం నేపథ్యంలో విధి విధానాల ఖరారు కోసం ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి నేతృత్వంలో ప్రత్యేక కమిటీ నియమించింది. రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగులకు మూడు డీఏలు, రెండు వేతన స్కేల్స్ రావాల్సి ఉంది. అయితే ప్రభుత్వం వీటిపై ఎలాంటి స్పష్టతనివ్వలేదు. వాటితో కలిపి వేతనాన్ని నిర్ణయిస్తారా లేకుంటే ఉద్యోగుల మాదిరిగా ఉన్న ప్రయోజనాలు కల్పించి అమలు చేస్తారా అనేది వేచి చూడాలి.

### ఆనందంగా ఉంది..



ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయించడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం నిర్ణయం తీసుకోవడం అభినందనీయం.

– ఎట్టెం శేఖర్, ఆర్టీసీ డ్రైవర్, నిర్మల్ డిపో

### కార్మికుల జీవితాల్లో వెలుగు



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగు నింపింది. ఎన్నో ఏళ్ల కల ఎట్టకేలకు నెరవేరింది. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో మా ఉద్యోగానికి భద్రత లభిస్తుంది.

– మహేందర్‌రెడ్డి, ఆర్టీసీ డ్రైవర్, నిర్మల్ డిపో

### నిజంగా శుభవార్తే..



ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కార్మికులందరికీ నిజంగా శుభవార్తే. ప్రభుత్వ నిర్ణయంతో మాకు ఉద్యోగ భద్రత లభిస్తుంది. బాధ్యత కూడా పెరుగుతుంది. సంస్థ లాభాల బాటలో పయనించేలా పనిచేస్తాం.


– గంగాధర్, నిర్మల్ డిపో

### తీపి కబురు...

ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రెండు పేస్కేళ్లు పెండింగ్‌లో ఉండడంతో ఆర్థికంగా ఇబ్బంది పడ్డాం. ప్రభుత్వంలో సంస్థను వి లీనం చేయడం ద్వారా మా కష్టాలు తీరుతాయి.

– మల్లికార్జున్, డ్రైవర్, భైంసా డిపో

## 'కడెం'కు పెరిగిన ఇన్‌ఫ్లో



గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీళ్లు



జేసీబీతో జనరేటర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

కడెం: కడెం ప్రాజెక్టుకు మంగళవారం వరద పెరిగింది. ఎగువ నుంచి 5,736 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు నాలుగు గేట్లను ఎత్తి 11,739 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్ట్ లెవల్ 690 అడుగులు దాటకుండా ఔట్‌ఫ్లోను కొనసాగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 689.125 అడుగుల నీటి మట్టం ఉంది.

**మొరాయించిన జనరేటర్..**

కడెం ప్రాజెక్టు గేజ్‌రూం వద్ద గల జనరేటర్ మంగళవారం మొరాయించింది. దీంతో మరమ్మతుల కోసం ప్రాజెక్ట్ అధికారులు మంగళవారం రాత్రి దానిని హైదరాబాద్‌కు తరలించారు. వారం రోజుల్లో మరమ్మతు పూర్తవుతుందని తెలిపారు. అప్పటి వరకు పవర్‌హౌస్‌లోని పాత జనరేటర్‌ను సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు.

**సదర్మాట్‌కు కొనసాగుతున్న వరద**

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్ ఆనకట్టకు మంగళవారం 8.6 ఫీట్లలో వరద ఉధృతి కొనసాగిందని ఏఈఈ ఉదయ్ తెలిపారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో వరద భారీగా వస్తోందని పేర్కొన్నారు. గోదావరి పరీవాహక గ్రామాల ప్రజలు వరద తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సదర్మాట్ నుంచి 9,422 క్యూసెక్కుల వరద గోదావరిలోకి వెళ్తోందని తెలిపారు.

## మహాగాంలో ఎస్ఎస్‌జీ అధికారుల పర్యటన

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామంలో స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్–23(ఎస్ఎస్‌జీ) అధికారులు మంగళవారం పర్యటించారు. గ్రామంలో శుభ్రత, ఇతర విషయాలను పరిశీలించారు. సామాజిక వర్గాలవారీగా జనాభా వివరాలను సేకరించారు. పంచాయతీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులు అడిగితెలుసుకున్నారు. ఇప్పటి వరకు గ్రామంలో జరిగిన పనుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఎస్ఎస్‌జీ అధికారి సునీల్ తెలిపారు. ఆయన వెంట జెడ్పీ సీఈవో సుధీర్‌బాబు, డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, సర్పంచ్ రాకేశ్ ఉన్నారు.

**గుండంపల్లి, కాల్వ గ్రామాల్లో..**

దిలావర్‌పూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులను స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ రాష్ట్ర స్థాయి బృందం మంగళవారం తనిఖీ చేసింది. గుండంపల్లి, కాల్వ గ్రామంలో కొనసాగుతున్న పనులను క్షేత్రస్థాయిలో సభ్యులు పరిశీలించారు. ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, కిచెన్ గార్డెనింగ్ ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. పంచాయతీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల రికార్డులు పరిశీలించారు. బృందం సభ్యులు ప్రశాంత్, రాకేశ్ వెంట డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీఎం శ్రీలత, డీఎల్పీ రమేశ్, ఎండీడీవో మోహన్, ఎంపీవో అజీజ్‌ఖాన్, ఏపీవో దివ్యారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తక్కల రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వాతి ఉన్నారు.



పనుల వివరాలు తెలుసుకుంటున్న అధికారి సునీల్

## ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 3 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రస్తావించి వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం డప్పు చప్పుళ్లతో ర్యాలీగా నూతన కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు 27 రోజులుగా సమ్మె చేస్తునాన ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. వెంటనే జేఏసీతో చర్చలు జరిపి కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. సఫాయి కార్మికులే నిజమైన దేవుళ్లు అని దండం పెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ 11వ పీఆర్సీ, జీవో 60 ప్రకారం కనీసం వేతనం రూ.16,500, కారోబార్, బిల్ కలెక్టర్, ట్రాక్టర్ డ్రైవర్, ఎలక్ట్రీషియన్లకు రూ.19,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 51ను సవరించాలని కోరారు. కార్మికులందరికీ ప్రమాదబీమా రూ.10 లక్షలు, సాధారణ బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ జిల్లా కార్యదర్శి సతీశ్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశ్, శ్రీనివాస్, నాగరాజు, మహేశ్, జిల్లా సహాయ కార్యదర్శులు ఆకాశ్, నగేశ్, దేవరావు, లింగన్న, స్వామి, గోవిందు, నాగేష్, కారోబార్ సంఘం అధ్యక్షుడు శేఖర్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు



ఈచిత్రంలో పడిపోయిన ఇల్లు ఖానాపూర్ పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన అడెపు నర్సయ్యది. ఈయన వ్యవసాయకూలీగా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఉన్న ఇంట్లో వచ్చేదాంతో బతుకుతున్నాడు. ఇటీవలి వర్షాలకు ఇల్లు కూలిపోవడంతో అద్దెకు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. అధికారులు వివరాలు రాసుకెళ్లారని, ఇప్పటి వరకు ఎలాంటి సాయం చేయలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు.

# సాయమందేనా..!?



ఈ చిత్రంలో కనిపిస్తున్నది భైంసా మండలం ఇలేగాం గ్రామంలో ఇటీవల వరదతో దెబ్బతిన్న బుట్ట రుక్మాబాయి చేను. మొత్తం మూడెకరాల్లో పత్తి, సోయా విత్తుకుంది. పంట బాగా మొలకెత్తుతుందని సంతోషించేలోపే వరద వచ్చిపడింది. మొత్తం మట్టి, రాళ్లతో చేను మొత్తం నింపేసింది. దాదాపు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లింది. పంట పోవడంతోపాటు ఈ రాళ్లను, మేటను ఎలా తీయాలో తెలియక రుక్మాబాయి కన్నీళ్లు పెట్టుకుంటోంది.

- దెబ్బతీసిన వరదలు
- పంటలు కోల్పోయి.. ఇళ్లు కూలిపోయి..
- ఇబ్బందులు పడుతున్న బాధితులు
- ఆర్థికసాయం కోసం ఎదురుచూపులు

నిర్మల్: భారీ వర్షాలు, వరదలతో జిల్లా నిండా మునిగింది. ఇప్పటికీ చాలా మండలాలు తేరుకోలేదు. వేల ఎకరాల్లో పంటలు కొట్టుకుపోయాయి. అసలు తమ పొలమేదో.. చేనేదో.. రైతులు గుర్తుపట్టలేనంతగా మేటలు వేశాయి. చాలాచోట్ల ఇళ్లు కూలిపోయాయి. ఉన్న ఆధారం పోవడంతో అద్దె ఇళ్లలో ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక రోడ్లు, చెరువుల పరిస్థితి మరీ దారుణం. ఇప్పటికీ చాలా గ్రామాలకు సరైన రాకపోకలు లేవు. ప్రభుత్వం తరపున మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు, ప్రతిపక్షాల నేతలూ వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తూ, పరామర్శిస్తూ వెళ్తున్నారు. కానీ నష్టపోయిన తమకు అందించాల్సిన సాయంపై ఎవరూ చెప్పడం లేదని బాధితులు వాపోతున్నారు.

**ఏళ్లుగా ఇదే బాధ..**

ఎప్పుడో ఒకసారి దెబ్బ తగిలితే.. పెద్దగా ఇబ్బంది అనిపించదు. కానీ.. ఏటా పగబట్టినట్లు ప్రకృతి దెబ్బ కొడుతుంటే బాధితులు తట్టుకోలేకపోతున్నారు. జిల్లాలో మూడేళ్లుగా రికార్డుస్థాయిలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈసారి సీజన్ ప్రారంభంలో మోస్తరుగా కురిసిన వానలు జులై చివరి వారానికి రాగానే జోరందుకున్నాయి. స్థానికంగా కురుస్తున్న వర్షానికి, ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద తోడవుతోంది. దీంతో వేసిన పంటలు వేసినట్లే నీటిపాలవుతున్నాయి. ఈసారీ పంట నష్టం భారీగానే నమోదైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు వచ్చిన లెక్కల ప్రకారం 18,041 మంది రైతులకు చెందిన 34,748 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేశారు.

**నిరాశ్రయులై..**

వరుసగా వరదలు ముంచెత్తుతుండటంతో వర్షాకాలం అంటేనే పేద, మధ్యతరగతి కుటుంబాలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. లోతట్టు, చెరువులు, వాగుల పరీవాహక ప్రాంతాల్లో ఇళ్లు ఉన్నవారు, పాత కట్టడాలు కలిగిన వాళ్లు ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏడాది కూడా జిల్లాకేంద్రంలోని స్వర్ణ వాగు పరీవాహకంలోని జీఎన్ఆర్ కాలనీ నిండా మునిగింది. కాలనీవాసులు అన్నీ వదిలి పునరావాస కేంద్రంలో తలదాచుకోవాల్సి వచ్చింది. వరద తగ్గిన తర్వాత మిగిలిన బురదను కడుక్కోవడానికి, దెబ్బతిన్న ఇళ్లను సరిచేసుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వచ్చింది. భైంసాలోనూ పలుకాలనీల పరిస్థితి ఇలాగే ఉంది. పలు మండలాల్లో పాతబడ్డ పెంకుటిళ్లు కూలిపోయాయి. దీంతో బాధితులు నిరాశ్రయులై అద్దె ఇళ్లను చూసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

**రాకపోకలకూ కష్టమే..**

వరదలు, వర్షాలతో చాలా మండలాల్లో రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. సారంగపూర్ మండలం యాకర్‌పల్లి, మలక్‌చించోలి, వంజర్, గొడిసెర, వైకుంఠాపూర్, కంకెట గ్రామాల్లో వంతెనలు, రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. లోకేశ్వరం మండలంలోని బోరిగాం–పుస్పూర్, సాథ్‌గాం–పేండ్‌పల్లి మధ్య వంతెనలు దెబ్బతిన్నాయి. అర్లి వంతెన సైతం దెబ్బతినడంతో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. సోన్ మండలం జాఫ్రాపూర్, మాదాపూర్ గ్రామాలకు వెళ్లే వంతెనలు, రోడ్లు కోతకు గురయ్యాయి. వీటికీ తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. కడెం మండలం గంగాపూర్, రాణిగూడ, కొత్తతండా పంచాయతీలు, మిద్దెచింతతోపాటు పది వరకు గ్రామాలకు ప్రతీసారి వరదలతో రాకపోకలు తెగిపోతున్నాయి. ఈసారి కూడా అదే పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదకరంగా వాగులుదాటాల్సి వస్తోంది. ఇప్పటి వరకు జిల్లాలో వేసిన అంచనా ప్రకారం రూ.25 కోట్ల విలువైన రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నట్లు అధికారులు చెబుతున్నారు.

### మొత్తం ఇసుకనే..



మాకున్న ఎకరంనరలో పత్తి వేసుకున్నం. రూ.20 వేల దాకా ఖర్చు చేసినం. మందులు కూడా కొట్టినం. మొన్నటి వానలకు మొత్తం కొట్టుకుపోయింది. చేనంతా ఇసుకనే అయ్యింది. పంటనష్టపోయిన మాలాంటోళ్లను సర్కారు ఆదుకోవాలి.

–జిల్ల రాజవ్వ, మలక్‌చించోలి, సారంగపూర్ మండలం

## రైతులు సంఘటితమైతే అద్భుతాలు

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- పెంబిలో ట్రైబల్ ఎఫ్‌పీవో ప్రారంభం

పెంబి: రైతులు సంఘటితమైతే అద్భుతాలు సృష్టిస్తారని కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మండల కేంద్రంలో గిరిజన రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ట్రైబల్ ఎఫ్‌పీవో)ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాబార్డు, ఐటీడీఏ సహకారంతో ఎఫ్‌పీవోకు అవసరమైన గోదాముల నిర్మాణానికి రాయితీపై రుణాలు ఇస్తామని తెలిపారు. ఐటీడీఏ తరపున గిరిజనులకు రాయితీపై మామిడి, జామ, కొబ్బరి, మునగ తదితర మొక్కలు అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ జానుబాయి, జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, నాబార్డు డీడీఎం వీరభద్రం, డీఏ సుజాత, స్పైసీ బోర్డు డీడీ సుందరేశన్, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో సుధాకర్, సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, బంజారా సంఘం రాష్ట్ర నాయకుడు శ్యాంనాయక్, రిలయన్స్, డ్రీమ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎఫ్‌పీవోను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఐటీడీఏ పీవో

## విధులను నిర్లక్ష్యంచేస్తే చర్యలు

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

కడెం: ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించాలని, విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఐటీడీ ఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పాఠాలు బోధించి, వారిని పలు ప్రశ్నలు అడిగారు. 6, 7 తరగతి విద్యార్థులు వెనుకబడి ఉండడంతో హెచ్ఎం బలరాం, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఆశ్రమ పాఠశాలను తనిఖీ..**

దస్తురాబాద్: మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీవో చహత్ బాజ్‌పాయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భోజనశాలను పరిశీలించారు. విద్యార్థుల కోసం తయారు చేసిన వంటలను తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



విద్యార్థి నుంచి సమాధానం రాబడుతున్న పీవో

## క్లుప్తంగా

### తెగిపడిన 11కేవీ విద్యుత్ వైర్లు.. తప్పిన ప్రమాదం..



తెగిపడిన విద్యుత్ వైర్లు...

ఖానాపూర్: పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో 11కేవీ విద్యుత్ వైర్లు తెగిపడడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు గమనించి వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో అధికారులు అక్కడికి చేరుకుని విద్యుత్ సరఫరా నిలిపివేసి వైర్లను తొలగించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఇన్సులేటర్ ఫెయిల్ కావడంతో వైర్లు తెగిపోయాయని ఏఈ తిరుపతి తెలిపారు. అంతకు ముందు పట్టణంలోని రోడ్డు వైడింగ్ పనుల్లో భాగంగా విద్యుత్ లైన్‌మార్చే పనులను అధికారులు పరిశీలించారు.

### పాముల కలకలం



మరణించిన పాము పిల్లలు

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని ఒకరి ఇంట్లో మంగళవారం 5 పింజర జాతి పాము పిల్లలు ఒకే దగ్గర కనిపించడం కలకలం రేపింది. దీంతో ఆ ఇంట్లో వ్యక్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కొందరు యువకులు ఆ పాములను చంపి బయట పడేశారు. ఎవరికీ ఎలాంటి ప్రాణ నష్టం జరుగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

### ఐటీఐ కళాశాలలో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐటీఐ కళాశాలలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ప్రభుత్వ ఐటీఐ కళాశాల నైట్ వాచ్‌మెన్ రాంషా సోమవారం సాయంత్రం 6గంటల సమయంలో విధులకు వచ్చాడు. అతడికి రాత్రి 10 గంటల ప్రాంతంలో ఛాతిలో నొప్పి రావడంతో ఆసుపత్రికి వెళ్లాడు. మంగళవారం ఉదయం 8:20 గంటల సమయంలో కళాశాలలో పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ ఎంఏ రియాజ్ గమనించే సరికి కళాశాల తాళాలు పగలగొట్టి ఉన్న విషయాన్ని గమనించి కళాశాల ప్రిన్సిపల్ సుజాత దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వచ్చి గమనించే సరికి కళాశాలలో కాపార్ వైర్, 5 సిల్లింగ్ ఫ్యాన్‌లు, మూడు స్ట్రీట్ లైట్స్ సెట్స్ దొంగలించినట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: కారును ఢీకొన్న ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని వాగ్దేవి కళాశాల ఎదుట గల సయ్యద్ సాదుల్ల తన నివాసం ముందు కారును పార్కింగ్ చేసి ఉంచాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న గ్యారేజీకి మరమ్మతుల కోసం ట్రాక్టర్ వచ్చింది. ట్రాక్టర్ డ్రైవర్ చిన్నపాటి రిపేర్ చేస్తుండగా ఆకస్మాత్తుగా ట్రాక్టర్ స్టార్ట్ అయి ముందు భాగంలో ఉన్న కారును ఢీకొట్టింది. కారు ధ్వంసం కాగా ట్రాక్టర్ డ్రైవర్ గౌతమ్‌కు గాయాలయ్యాయి. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.


సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు, CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ఫోన్ : 9041115088 [HA-29901]

WANTED

ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221471]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462


# టీడబ్ల్యూపీఎస్‌లపై పర్యవేక్షణేది..?

- సొంత పనులకే ప్రాధాన్యత ఇస్తున్న ఎస్‌సీఈఆర్పీలు
- ప్రాథమిక స్థాయిలో మెరుగుపడని విద్య
- కొంత మంది ఎస్‌ఈఆర్పీలకు మెమోలు జారీ చేసినా మారని తీరు



ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలంటే ముందుగా ప్రాథమిక స్థాయిలో నాణ్యమైన విద్య అందాలి. అప్పుడే వారు పైతరగతులకు వెళ్లినప్పుడు చదవడం, రాయడం చేయగలుగుతారు. అందుకు ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసింది. విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించేందుకు ఐటీడీఏ ఉన్నతాధికారులు ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని హెచ్‌ఎంలతో పాటు స్కూల్ కాంప్లెక్స్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఎస్‌సీఈఆర్పీ)లను నియమించింది. ఎస్‌సీఈఆర్పీలు వారివారి కాంప్లెక్స్ పరిధిలోని గిరిజన ప్రాథమిక పాఠశాల(టీడబ్ల్యూపీఎస్)ను తనిఖీ చేయాల్సి ఉంటుంది. అయితే వారి పర్యవేక్షణ నామమాత్రంగానే ఉందని పలువురు గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. దీంతో కొన్ని ప్రాథమిక స్థాయిలోని విద్యార్థులకు కనీసం ఏబీసీడీలు, అ, ఆ, ఇ, ఈలు కూడా రావడం లేదు.

### జిల్లాలో 495 ప్రాథమిక పాఠశాలలు

గిరిజన సంక్షేమ శాఖ ఐటీడీఏ పరిధిలో జిల్లాలో 495 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక స్థాయిలో ఒకటి, రెండు తరగతులు కొనసాగిస్తున్నారు. ఆ యా పాఠశాలలో సుమారు 7వేల మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం విద్యాను అభ్యసిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే ప్రాథమిక స్థాయిలో కొనసాగుతున్న విద్యా బోధన పరిశీలించేందుకు జిల్లా వ్యాప్తంగా 29 మంది ఎస్‌సీఈఆర్పీ లను ఐటీడీఏ అధికారులు నియమించారు. వీరు ప్ర తి రోజు వారివారి పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ను సందర్శించి విద్యా బోధన, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఇక్కడి వరకు బాగా నే ఉన్న కొంత మంది ఎస్‌సీఈర్పీలు తూతూ మంత్రంగా పాఠశాలకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించకుండానే సెల్ఫీ ఫొటో దిగి రికార్డులలో సంతకాలు చేసి వస్తున్నారనే విమర్శలు లేకపోలేదు.

**కొరవడుతున్న పర్యవేక్షణ**

ఆయా కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలల తనిఖీకి వెళ్లినప్పుడు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్నారు. కొన్ని పాఠశాలలోని విద్యార్థులకు కనీసం ఏ, బీ, సీ, డీ, అ, ఆ, ఇ, ఈలు కూడా రావడం లేదని వారు వాపోతున్నారు. ప్రధానంగా పర్యవేక్షణ కోసం నియమించిన ఎస్‌ఈసీఆర్పీల లోపంతోనే ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని పలువురు కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పేర్కొంటున్నారు.

**మెమోలు జారీ చేసిన మారని తీరు**

జిల్లాలోని కొన్ని ప్రాథమిక పాఠశాలల ఎస్‌సీఈఆర్పీలు తూతూ మంత్రంగా తనిఖీ చేయడంతో ఆయా పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలోని హెచ్‌ఎంలు మెమోలు సైతం జారీ చేసిన సందర్భాలు ఉన్నాయి. కానీ వారి తీరు మాత్రం మారడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి అలాంటి వారిపై చర్యలు తీసుకుంటే ప్రాథమిక స్థాయిలో విద్యా మెరుగుపడడానికి ఆస్కారం ఉంది.

### సొంత పనులకే ప్రాధాన్యత

జిల్లాలోని గిరిజన ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ చేయవాల్సిన ఎస్‌సీఈఆర్పీలు పాఠశాలకు వెళ్లి సెల్ఫీ తీసుకోని అక్కడ ఉన్న ఉపాధ్యాయులతో కబుర్లు చెప్పి వెళ్లిపోతున్నారని, ఇంకొంత మంది ఎస్‌సీఈర్పీలు దినం అంతా వారి సొంత పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపనలున్నాయి. అలాంటి ఎస్‌సీఈఆర్పీలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటే ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడానికి ఆస్కారం ఉంది.

### విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించాలి



ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించేందుకు జిల్లాలో 29 మంది ఎస్‌సీఈఆర్పీలు ఉన్నారు. విద్యార్థులకు చదవడం, రాయడం వస్తుందో లేదోనని గమనించాలి. ఎవరైనా తూతూమంత్రంగా తనిఖీలు చేసి విధుల సమయంలో సొంత పనులకు ప్రాధాన్యత ఇస్తే వారిని తప్పించి ఇతరులను నియమిస్తాం.

– డాక్టర్ దిలీప్‌కుమార్, డీడీ, ఐటీడీఏ, ఉట్నూర్

### నిమ్స్‌లో తల్లీకూతురు

- రోడ్డు ప్రమాదంలో విరిగిన కాళ్లు, చేతులు
- హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించిన కుటుంబీలు
- ఆపరేషన్‌కు డబ్బులు లేక అవస్థలు
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు



చికిత్స పొందుతున్న తల్లి

బోథ్: బోథ్ మండలంలోని కుచూలాపుర్ వద్ద ఇటీవల రెండు ఆటోలు ఢీకొన్న ప్రమాదంలో దన్నూర్ గ్రామానికి చెందిన తొర్తి సాగర ఆమె కూతురు సోనీలకు తీవ్ర గాయాలయ్యాయి. వారి కాళ్లు, చేతులకు ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వారిని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆపరేషన్‌కు దాదాపు రూ.5లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన సాగర ప్రస్తుతం ఆపరేషన్ చేయించుకోలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ధన్నూర్ గ్రామానికి చెందన యువకులు రూ.30వేలు ఆర్థిక సాయం చేశారు. దాతలు స్పందించి ఆదుకోవాలని ఆ తల్లీకూతుర్లు వేడుకుంటున్నారు.

ఫోన్‌పే, గూగుల్ పే 9133184158

# ఉద్యమకారుడి హఠాన్మరణం



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ప్రజాప్రతినిధులు

- గుండెపోటుతో ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ లక్కేరావు మృతి
- అంత్యక్రియలకు హాజరైన ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఐటీడీఏ పీవో

ఇంద్రవెల్లి: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ కనక లక్కేరావు(59) మంగళవారం గుండెపోటుతో హఠాన్మరణం పొందారు. తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయ జేఏసీ కన్వీనర్‌గా ఈయన చురుకైన పాత్ర పోషించారు. 2006లో ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేశారు. అనంతరం ఆదివాసీ రాయిసెంటర్ సలహాదారుడిగా కొనసాగుతూనే ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. బీఆర్‌ఎస్‌లో జిల్లా, రాష్ట్రస్థాయిలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఈయన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం 2016లో ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించింది. 2018 వరకు ఈ పదవిలో కొనసాగారు. ఏజెన్సీ మండలాల్లోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేశారు. ఈ క్రమంలో రెండోసారి 2021లో ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించగా ఇప్పటి వరకు కొనసాగుతూ వచ్చారు. ఈయనకు భార్య అనుసూయబాయి, కుమారులు వెంకటరమణ, కళ్యాణ్ ఉన్నారు.

**తుమ్మగూడలో విషాదఛాయలు**

లక్కేరావు మృతితో ఆయన స్వగ్రామమైన ఇంద్రవెల్లి మండలం తుమ్మగూడలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖులతో పాటు ఆదివాసీ గిరిజన నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజనులు భారీగా తరలివచ్చారు. మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, మాజీ ఎంపీ గోడం నగేశ్, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్, నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ గ్రామానికి చేరుకొని మృతదేహం వద్ద నివాళులర్పించారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

**లక్కేరావు మృతి తీరనిలోటు: మంత్రి ఐకేరెడ్డి**

నిర్మల్: ఐటీడీఏ ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ కనక లక్కేరావు హఠాన్మరణం గిరిజన జాతికి తీరని లోటని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. లక్కేరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**ఎంపీ సంతాపం..**

ఆదిలాబాద్: ఐటీడీఏ చైర్మన్ లక్కేరావు అకాల మరణం ఆదివాసీ సమాజానికి తీరని లోటని ఎంపీ సోయం బాపురావు ప్రకటనలో పేర్కొన్నారు. రెండుసార్లు ఐటీడీఏ చైర్మన్‌గా పనిచేసిన లక్కే రావు ఉట్నూర్ రోజు ఏజెన్సీ ప్రాంతంలోనూ, ఉమ్మడి జిల్లాలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. లక్కే రావుతో తనకున్న అనుబంధం విడదీయరానిదని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# పాలకు C/O పెర్కగూడ

- ఏళ్లుగా పాల సరఫరా
- తాతల కాలం నుంచి నేటి యువత సైతం..
- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం



పాల అమ్మకానికి బైక్‌పై సిద్ధం చేస్తున్న గ్రామస్తుడు



గ్రామంలోని గేదెలు

ఉట్నూర్‌రూరల్: పెర్కగూడ గ్రామం అంటే ఏజెన్సీ ప్రాంతంలో తెలియని వారంటూ ఉండరు. ఎందుకంటారా...? అదేమిటంటే పాల ఉత్పత్తి.. ఈ గ్రామం దాదాపు 59ఏళ్లుగా ఉట్నూర్ పట్టణ కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు పాలన్నం దిస్తూ... ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

**59ఏళ్లుగా పాల సరఫరా...**

ఉట్నూర్ మండల కేంద్రం నుంచి 2కిలో మీటర్ల దూరంలో ఆదిలాబాద్ -మంచిర్యాల ప్రధాన రహదారి పక్కనే లింగోజీతండా పంచాయతీలో ఈ గ్రామం ఉంది. ఇదీ వెలసి దాదాపు 64ఏళ్ల అవుతుంది. గతంలో రామలింగంపల్లి అని పిలిచేవారు. గ్రామంలో పెర్క కులస్తులు ఉండడంతో పెర్కగూడ అనే పేరు వచ్చింది. దాదాపు 59ఏళ్లుగా ఉట్నూర్ పట్టణ కేంద్రానికి ఈ గ్రామం నుంచి పాలు సరఫరా అవుతున్నాయి. ఇళ్లతో పాటు హోటళ్లు, హాస్టళ్లు, ఆస్పత్రులకు పాలు వస్తుంటాయి. గ్రామం ఏర్పడిన సమయంలో దాదాపు 100ఇళ్లు ఉండేవి. ప్రతీ ఇంటికి ఓ గేదె చొప్పున 100 గేదెలతో పాల వ్యాపారం ప్రారంభించారు. సేరుకు రూ.2 నుంచి ప్రారంభమై నేడు రూ.50 లీటర్‌కు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఈ గ్రామంలో 250 నుండి 300 వరకు ఇళ్లు ఉండగా గ్రామంలోని 90 శాతం మంది నేటికీ పాల వ్యాపారం సాగిస్తున్నారు. తాతల కాలం నుంచి మొదలు యువకులు సైతం పాల వ్యాపారం చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

**ప్రతీ ఇంటి ఎదుట.. పశువులే..**

ఈ గ్రామంలో ఏ ఇంటిని తట్టినా పాడి పశువులు కనిపిస్తుంటాయి... చిన్నాపెద్ద, ఆడ మగ అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ పాలు పితకడం, గడ్డి పెట్టడం, పేడ తీయడం లాంటి పనులు ఎవరికి వారు చకచకా చేస్తుంటారు.. ఇక ఉదయాన్నే 4–5 గంటల ప్రాంతంలో లేచి పాలు సిద్ధం చేసి గ్రామం నుంచి ఉట్నూర్ పట్టణ కేంద్రం వరకు రెండు కిలో మీటర్లు వచ్చి పాలు పోస్తుంటారు. ఈ పాల వ్యాపారంపైనే పలు కుటుంబాలు అభివృద్ధి చెందాయని గ్రామ పెద్దలు చెబుతున్నారు.



ఇంటి ఎదుట గేదెలు

**పండుగ వేల గ్రామంలో సందడి**

పాలకు పేరుగాంచిన ఈ గ్రామంలో ఏ పండుగ వచ్చినా గ్రామంలో సందడి నెలకొంటుంది.. గ్రామం ఏర్పాటు నుండి పాలు పెరుగు లభిస్తుండటంతో పండుగ రోజు ప్రజలు అధిక సంఖ్యలో పాలు, పెరుగు కోసం ఆ గ్రామానికి వచ్చి తెచ్చుకుంటారు.

**పెర్కగూడపై పాల ప్యాకెట్ల దెబ్బ**

ఉట్నూర్ పట్టణానికి ఇతరాత్ర ప్రాంతాలకు పాలు అందిస్తూ తమ సేవలు అందిస్తున్న ఆ గ్రామంపై నేడు మార్కెట్‌లో లభ్యమవుతున్న పాల ప్యాకెట్లతో దెబ్బపడింది.. గతంలో ఆ గ్రామం నుంచి పాలు వచ్చేంత వరకూ స్థానికులు ఎదురుచూస్తుండే వారు. ప్రస్తుతం సాధారణంగా పాలు లభిస్తుండటంతో ప్రజలు పాలప్యాకెట్లపై ఆధార పడుతున్నారు. దీంతో గ్రామం నుంచి వస్తున్న పాలు కొద్దో.. గొప్పో ఇప్పటికీ పట్టణ కేంద్రానికి అందిస్తున్నారు.

# తీవ్రమవుతున్న అస్తిత్వ పోరాటం



దీక్షలో భవన నిర్మాణ సంఘం నాయకులు

బోథ్: బోథ్ మండలాన్ని డివిజన్‌గా ప్రకటించాలని చేస్తున్న పోరాటం ఉధృతమవుతోంది. డివిజన్ కోసం చేస్తున్న దీక్షలు మంగళవారానికి 16రోజులకు చేరింది. దీక్షలో భవన నిర్మాణం మేస్త్రీ సంఘం నాయకులు కూర్చున్నారు. వీరికి ఏఐసీసీ నాయకులు నరేష్ జాదవ్, తుడుం దెబ్బ నాయకులు సంఘీభావం ప్రకటించారు. డివిజన్ కోసం పూర్తి మద్దతిస్తున్నట్లు తెలిపారు. తుడుం దెబ్బ నాయకులు పండెం శంకర్ మాట్లాడుతూ ఉద్యమానికి సంపూర్ణం మద్దతు ఇస్తున్నామని అవసరమైన పోరాటం చేస్తామన్నారు. కాగా కుచలాపూర్ గ్రామస్తులు రెవెన్యూ డివిజన్ కోసం తమ సంఘీభావని ప్రకటించారు. కార్యక్రమంలో బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎంపీపీ శ్రీనివాస్

**మంత్రులను కలిసిన ఎంపీపీ...**

బోథ్: బోథ్ నియోజకవర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిలను మంగళవారం కలిసి విన్నవించారు. అలాగే కొత్తగా ఏర్పడిన సోనాల మండలానికి 108 అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు ఎంపీపీ పేర్కొన్నారు.

### యువకుడి ఆత్మహత్య

తలమడుగు: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... కొత్తూరు గ్రామానికి చెందిన ఆది హరీష్ (28) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బులు మొత్తం మద్యానికి వెచ్చిస్తున్నాడు. దీంతో భార్య అశ్విని పలుమార్లు మద్యం తాగొద్దని గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి అతిగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో సుంకిడి గ్రామంలో పురుగుల మందు తాగి పడిపోయాడు. గ్రామస్తులు గమనించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య అశ్విని ఫిర్యాదు మేరకు ఎస్సై ధనశ్రీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు ఉన్నాడు.

# పన్నులు కట్టలేదని బల్దియా దుకాణాలకు తాళం

- ఆందోళనకు దిగిన బాధితులు, కాంగ్రెస్ మద్దతు



మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నాయకుడు సాజిద్‌ఖాన్



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధితులు, సాజిద్‌ఖాన్

కైలాస్‌నగర్: ఏళ్లతరబడి పన్నులను చెల్లించడం లేదంటూ పట్టణంలోని శివాజీచౌక్‌లోని కూరగాయల మార్కెట్‌లోని దుకాణాలకు మున్సిపల్ అధికారులు తాళాలు వేయడం మంగళవారం ఆందోళనకు దారి తీసింది. పట్టణ ప్రణాళిక విభాగం అధికారి అనురాధ తన సిబ్బందితో కలిసి మార్కెట్‌కు చేరుకుని దుకాణాలకు తాళాలు వేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ నాయకులు బాధితులతో కలిసి వారిని అడ్డుకున్నారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఉన్నపాటుగా ఎలా సీజ్ చేస్తారని కాంగ్రెస్ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ బల్దియా అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికే మూడు సార్లు దుకాణ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామని, దుకాణాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయనే ఆర్ అండ్‌బీ అధికారుల సూచనల మేరకు వాటిని సీజ్ చేస్తున్నట్లుగా టీపీవో అనురాధ తెలిపారు. తాళాలు వేయనీయకుండా నాయకులు, బాధితులు అడ్డుపడటంతో చేసేదేమిలేక బల్దియా అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. దుకాణదారులతో కలిసి సాజిద్‌ఖాన్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా దుకాణాలను సీజ్ చేస్తే వ్యాపారాలు దెబ్బతీనే అవకాశముందని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కాగా బల్దియాకు సంబంధించిన 32 దుకాణాలకు సంబంధించి కొన్నేళ్ల నుంచి ట్యాక్స్‌లు కట్టడం లేదని సుమారు రూ.45లక్షల పన్నులు పెండింగ్‌లో ఉన్నందునే కమిషనర్ ఆదేశాల మేరకు షాపులకు తాళాలు వేసినట్లుగా టీపీఓ తెలిపారు.

### వివాహిత ఆత్మహత్య

కుంటాల: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై హన్మండ్లు వివరాల ప్రకారం... మండలంలోని లింబా(బి)లో అంబకంటి శ్రీలత (గజ్జవ్వ) (30)కు 12ఏళ్ల క్రితం సారంగాపూర్ మండలంలోని అలూర్ గ్రామానికి చెందిన మహేందర్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు వైష్ణవి, ఆకృతి. రెండేళ్ల క్రితం కుటుంబ కలహాలతో పుట్టింటికి వచ్చి అక్కడే ఉండిపోయింది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



బాధితుడికి ఫోన్ ఇస్తున్న సీఐ సత్యనారాయణ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బ్రాహ్మణవాడకు చెందిన విశ్వనాథ్ నెలరోజుల క్రితం తన ఫోన్‌ను పోగొట్టుకోగా మంగళవారం వన్‌టౌన్ సీఐ సత్యనారయణ బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఫోన్ పోగొట్టుకున్న, చోరీకి గురైన పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను కనుగొని రికవరీ చేయడం జరుగుతుందని తెలిపారు.

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ బస్టాండ్‌లో రూ. 20 వేల విలువల గల సెల్‌ఫోన్‌ను మరిచి పోయిన ప్రయాణీకురాలికి ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం తిరిగి ఫోన్ అప్పగించారు. స్థానిక బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తున్న ఇంద్రవెల్లికి చెందిన వినోద బస్సు రాగానే బస్టాండ్‌లో ఫోన్ పెట్టి మరిచిపోవడంతో ఆర్టీసీ ఉద్యోగులు గమనించి సదరు వినోదకు ఫోన్ చేయడం ద్వారా ఆమె ఇంద్రవెల్లి నుండి ఉట్నూర్ రావడంతో ఆమెకు సూపరిండెంట్ శకుంతల ఆధ్వర్యంలో సెల్ ఫోన్ అప్పగించారు.